
# దొడ్డిదారుల ప్రేమ... జీవితాల విధ్వంసం

**తెలుగు రాష్ట్రాల్లో పెరుగుతున్న వివాహేతర సంబంధాలు -- కుటుంబాలను కూల్చేస్తున్న మౌన నేరాలు**



**ములుగు జిల్లా ప్రతినిధి మే 01 (పీపుల్స్ న్యూస్):**తెలుగు రాష్ట్రాల్లో రోజురోజుకూ వివాహేతర సంబంధాలు భయంకరమైన స్థాయిలో పెరుగుతున్నాయి. ఒక క్షణపు మోహం, శారీరక సుఖం, డబ్బు లేదా కొత్తదనం అనే మాయలో పడిపోయి కొందరు తీసుకునే తప్పు నిర్ణయాలు... చివరికి ప్రాణ నష్టం, జైలు జీవితం, శాశ్వత పశ్చాత్తాపంగా మారుతున్నాయి.ఒకప్పుడు ప్రేమ, నమ్మకంతో మొదలైన దాంపత్య జీవితం, మూడో వ్యక్తి ప్రవేశంతో శత్రుత్వంగా మారుతోంది. ఈ అక్రమ బంధాల ప్రభావం కేవలం భార్యాభర్తలకే కాదు... అమాయకమైన పిల్లల జీవితాలపై కూడా పడుతోంది.ఎందుకు పెరుగుతున్నాయి ఈ అక్రమ బంధాలు? సాంకేతిక పరిజ్ఞానం, సోషల్ మీడియా పరిచయాలు, కుటుంబాల్లో సంభాషణల లోపం వివాహేతర సంబంధాలకు బీజం వేస్తున్నాయి.కొంతమంది శారీరక సుఖం కోసం,మరికొందరు ఆర్థిక లాభాల కోసం,మరికొంతమంది ప్రేమ పేరుతో ఈ దొడ్డిదారుల్లోకి వెళ్తున్నారు.మూడో వ్యక్తి అడుగుపెట్టిన క్షణం నుంచే అనుమానాలు, గొడవలు, హింస మొదలవుతాయి. పచ్చని సంసారాలు క్రమంగా బూడిదగా మారుతాయి.అడ్డొచ్చినవారే శత్రువులు వివాహేతర సంబంధాల్లో ఒకరు అడ్డొస్తే చాలు...అది భార్య

# చికాగో అమరుల త్యాగాలను పరిహాసం చేస్తున్న కేంద్రం: సిపిఐ



**వనపర్తి,మే 01 (పీపుల్స్ న్యూస్) :** అమెరికా చికాగో లో కార్మిక అమరుల ప్రాణత్యాగంతో సాధించుకున్న 8 గంటల పని దినాన్ని 12 గంటలకు పెంచి కేంద్ర బిజెపి ప్రభుత్వం పరిహాసం చేస్తోందని బుద్ధి చెప్పాలని కార్మికలోకానికి సిపిఐ జిల్లా కార్యదర్శి విజయరాములు, వనపర్తి నియోజకవర్గకార్యదర్శి రమేష్ పిలుపునిచ్చారు. వనపర్తిలో సిపిఐ ఏఐటియుసి ఆధ్వర్యంలో 141 వ మేడే వేడుకలను ఘనంగా నిర్వహించారు. కర్రెమ్మ గుడి, పార్టీ ఆఫీస్, అంబేద్కర్ చౌక్, రాజీవ్ చౌక్, టీచర్స్ కాలనీ చౌరస్తాలో సిపిఐ ఆధ్వర్యంలో విజయ రాములు, కళావతమ్మ, చంద్రయ్య, పృథ్వీ నాదం, ఎర్ర కురుమయ్య ఎర్రజెండాలను ఆవిష్కరించగా స్నేహ ఫుట్పాత్ సెంటర్, జిల్లా ఆస్పత్రి, మెడికల్ కాలేజ్ వద్ద ఏఐటీయూసీ ఆధ్వర్యంలో శాంతన్న, శ్రీను ఏఐటీయూసీ అరుణ పతాకాలను ఆవిష్కరించారు. 18 గంటల పరిధినాన్ని తగ్గించాలని, కనీస వేతనం ఇవ్వాలని అమెరికా చికాగో నగరంలో లక్షలాది మంది కార్మికులు ఉద్యమించారన్నారు. పాలకులు జరిపిన కాల్పుల్లో చాలామంది కార్మికులు ప్రాణాలు కోల్పోయారన్నారు. అందులో ఒక కార్మికుడు తన శరీరం నుంచి కారుతున్న రక్తంలో తన అంగీని తడిపి ఎగరవేశారని అదే నేడు ఎర్రజెండాగా ప్రపంచ కార్మికులకు కష్టజీవులకు అండగా ఉండి పోరాడు పొందన్నారు. అమరుల పోరాట ఫలితంగా ఎనిమిది గంటల పని దినం ప్రపంచవ్యాప్తంగా అమలవుతుండగా భారత దేశంలో నరేంద్ర మోడీ ప్రభుత్వం కార్మిక చట్టాలను లేబర్ కోడలుగా మార్చి పని దినం 12 గంటలకు పెంచటం దుర్మార్గమన్నారు. కార్మికుల శ్రమను సంపన్నులకు దోచి పెట్టేందుకే నరేంద్ర మోడీ 12 గంటల పని దినం చేశారని వ్యతిరేకంగా పోరాడాలి అన్నారు. స్వాతంత్ర కాలం నుంచి సాధించుకున్న 44 చట్టాలను నాలుగు లేబర్ కోడలుగా విభజించి వేతనం కోసం పోరాడే హక్కు, సంగం పెట్టుకునే హక్కు లేకుండా చేసిన నరేంద్ర మోడీ దుర్మార్గం ప్రభుత్వానికి కార్మికుల ఐక్యమై బుద్ధి చెప్పాలన్నారు. కార్మికులు సంఘటితంగా పోరాడితేనే వారి హక్కులు దక్కుతాయి అన్నారు. సిపిఐ, ఏఐటీయూసీ ఎర్రజెండాల కింద ప్రజలు కార్మికులు ఏకమై పోరాడాలని కోరారు. సిపిఐ నియోజకవర్గ కార్యదర్శి రమేష్, సీనియర్ నేత కళావతమ్మ,సిపిఐ, ఏఐటీయూసీ, ఎన్ఎఫ్ఐ డబ్ల్యు, ఏఐఎస్ఎఫ్, ఏఐవైఎఫ్, డిహెచ్పిఎస్ నేతలు చంద్రయ్య పృథ్వి నాదం గోపాలకృష్ణ ఎర్రకుర్మయ్య శేఖర్ మహేష్ వెంకటయ్య విష్ణు అశోక్ లక్ష్మీనారాయణ రాంబాబు శిరీష జ్యోతి సాయి లీల వంశీ రూప నరేష్ స్వామి శ్రీను నరసింహ శాంతయ్య నరేందర్ లక్ష్మి రాజేష్ శ్రీకాంత్ జలాల్ తదితరులు పాల్గొన్నారు.

# కార్మికుల హక్కుల పరిరక్షణకు ప్రతి ఒక్కరూ కట్టుబడి ఉండాలి...

**స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ శ్రీజ**







**ఖమ్మం/ మే 1/(పీపుల్స్ న్యూస్):**కార్మికుల హక్కుల పరిరక్షణకు ప్రతి ఒక్కరూ కట్టుబడి ఉండాలని స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ డాక్టర్ పి. శ్రీజ అన్నారు.కార్మిక దినోత్సవాన్ని పురస్కరించుకుని శుక్రవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో నిర్వహించిన మే డే వేడుకల్లో అదనపు కలెక్టర్ పాల్గొన్నారు.ఈ సందర్భంగా స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ డాక్టర్ పి. శ్రీజ మాట్లాడుతూ ఖమ్మం జిల్లా కమ్యూనిస్టు భావజాలానికి నిలయంగా ఉండి అనేక మంది నాయకులను అందించిందని తెలిపారు. తమ హక్కుల కోసం పోరాడటం కమ్యూనిస్టు భావజాలం యొక్క ముఖ్య ఉద్దేశ్యమని పేర్కొన్నారు. కార్మిక రంగంలో మహిళల భాగస్వామ్యం ఎక్కువగా ఉన్నప్పటికీ, కార్మిక సంఘాలలో వారు చురుకుగా పాల్గొనడం పెరగాల్సిన అవసరం ఉందన్నారు.ప్రతి ఒక్కరికీ కార్మిక చట్టాల ప్రకారం హక్కులు ఉంటాయని చెప్పారు. స్వాతంత్ర్యం తర్వాత గత 80 ఏళ్లలో కార్మికుల జీవన ప్రమాణాల్లో గణనీయమైన మార్పులు వచ్చాయని, పేదరికాన్ని తగ్గించడంలో విద్య కీలక పాత్ర పోషించిందన్నారు. కుల, మత, ఆర్థిక భేదాలు లేకుండా అనేక మంది విద్య ద్వారా ఉన్నత స్థాయికి ఎదిగారని తెలిపారు.ప్రస్తుతం కార్మికుల కోసం అనేక సంక్షేమ పథకాలు అమలులో ఉన్నాయని, ఇతర దేశాలతో పోలిస్తే మన దేశంలో కార్మికులకు మెరుగైన సదుపాయాలు ఉన్నాయని పేర్కొన్నారు. ఎనిమిది గంటల పని విధానం కచ్చితంగా అమలు కావాలని, పని సమయం తర్వాత ఉద్యోగులను ఇబ్బంది పెట్టకూడదని, ఎవరి శ్రమనూ దోపిడీ చేయరాదని అన్నారు.ఇటీవలి కాలంలో మానవ శ్రమ విలువ తగ్గుతున్నదని, ఈ పరిస్థితి మారాలని సూచించారు. మనిషిని మనిషిగా గౌరవించినప్పుడు ప్రత్యేక కార్మిక చట్టాల అవసరం తగ్గుతుందని, “పని దైవం” అనే భావనను ప్రతి ఒక్కరూ ఆచరించాలని చెప్పారు.కార్మిక సంక్షేమ పథకాలు కచ్చితంగా అమలు కావాలని, అనర్హులకు లబ్ధి అందకుండా చూడాలని, ప్రజల సొమ్మును సమర్థవంతంగా వినియోగించాలని అధికారులకు సూచించారు.విదేశీ ఉపాధి కోసం టామ్‌కామ్ ద్వారా భాషా శిక్షణ, స్థానిక నిబంధనలు, అవసరమైన నైపుణ్యాలు అందించి, కార్మికులకు రక్షణ కల్పిస్తున్నామని తెలిపారు. జిల్లా నిరుద్యోగ యువత జాబ్ మేళాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.ప్రస్తుతం నైపుణ్యాలు ఉన్నవారికి ఎక్కువ ఉపాధి అవకాశాలు లభిస్తున్నాయని, ఆధునిక అవసరాలకు అనుగుణంగా శిక్షణ అందించేందుకు ఏటీసీ ఏర్పాటు చేసినట్లు తెలిపారు. కార్మిక కుటుంబాల్లో నిరుద్యోగులు టామ్‌కామ్, ఏటీసీ, డీఈఈటీ సేవలను వినియోగించుకోవాలని పిలుపునిచ్చారు.గత ఏడాదిలో కార్మిక శాఖ పలు కార్యక్రమాల ద్వారా 7,498 మంది కార్మికులకు రూ.35 కోట్లు 38 లక్షల విలువైన సహాయం అందించిందని వెల్లడించారు.అనంతరం 2025-26 సంవత్సరానికి సంబంధించిన కార్మిక శాఖ విజయాల పుస్తకాన్ని అదనపు కలెక్టర్ ఆవిష్కరించారు.ఈ కార్యక్రమంలో ఉప కార్మిక శాఖ కమీషనర్ కె. విజయభాస్కర రెడ్డి, జిల్లా ఉపాధి కల్పన అధికారి యన్. మాధవి, సంబంధిత అధికారులు, వివిధ శాఖల అధికారులు, కార్మిక సంఘాల ప్రతినిధులు, కార్మికులు, విద్యార్థిని, విద్యార్థులు, సిబ్బంది పాల్గొన్నారు.

# మల్కాజిగిరికి తొలి మహిళ కమిషనర్ బి. సుమతి ఐపీఎస్ బాధ్యతల స్వీకారం

**తప్పు చేస్తే తప్పించుకోలేరు అంటున్న కమిషనర్.**





**మల్కాజిగిరి కమిషనరేట్, క్రైమ్ బ్యూరో, మే 01 (పీపుల్స్ న్యూస్):** మల్కాజిగిరి పోలీస్ కమిషనరేట్ నూతన పోలీస్ కమిషనర్‌గా సీనియర్ ఐపీఎస్ అధికారిణి బి. సుమతి శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆమెకు ఉన్నతాధికారులు, పోలీస్ సిబ్బంది ఘన స్వాగతం పలికారు. అనంతరం ఐపీఎస్ అధికారిణి బి. సుమతి మీడియాతో మాట్లాడుతూ శాంతిభద్రతల పరిరక్షణే తమ ప్రధాన లక్ష్యమని స్పష్టం చేశారు.మల్కాజిగిరి కమిషనరేట్‌కు ప్రశాంత ప్రాంతంగా ఉన్న మంచి పేరును నిలబెట్టేందుకు కట్టుబడి పనిచేస్తామని సుమతి తెలిపారు. ప్రజలకు పారదర్శకమైన, సమర్థవంతమైన సేవలు అందించడం తన ప్రథమ కర్తవ్యమని పేర్కొన్నారు. మల్కాజిగిరికి తొలి మహిళ పోలీస్ కమిషనర్‌గా నియామకం కావడం గౌరవంగా, బాధ్యతగా భావిస్తున్నానని చెప్పారు. సాంకేతికతతో నేరాల నియంత్రణ నేరాల నియంత్రణలో ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని విస్తృతంగా వినియోగిస్తామని సీపీ వెల్లడించారు. ¬ూ× ఆధారిత “TG QUEST” వ్యవస్థను ఉపయోగించి నేరాలను అరికట్టే దిశగా చర్యలు తీసుకుంటామని చెప్పారు. ముఖ్యంగా పెరుగుతున్న సైబర్ నేరాలపై ప్రాసెస్ ఓరియెంటెడ్, రిజల్ట్ ఓరియెంటెడ్ విధానంతో కఠిన చర్యలు తీసుకుంటామని, బాధితులకు త్వరితగతిన న్యాయం అందేలా కృషి చేస్తామని తెలిపారు. సైబర్ నేరాలపై ప్రజల్లో అవగాహన పెంచేందుకు ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహిస్తామని చెప్పారు.

డ్రగ్స్‌పై కట్టడి, ట్రాఫిక్‌పై ఫోకస్

సమాజానికి సవాలుగా మారిన మాదకద్రవ్యాల అక్రమ రవాణా, వినియోగంపై ప్రివెన్షన్, డిటెక్షన్, ఎఫెక్టివ్ ఇన్వెస్టిగేషన్‌పై ప్రత్యేక దృష్టి సారిస్తామని హెచ్చరించారు. యువత మత్తు బారిన పడకుండా AI ఆధారిత నిఘా వ్యవస్థను బలోపేతం చేస్తామని తెలిపారు. అలాగే, కమిషనరేట్ పరిధిలో పెరుగుతున్న వాహనాల రద్దీని దృష్టిలో ఉంచుకుని ట్రాఫిక్ క్రమబద్ధీకరణకు పెద్దపీట వేస్తామని, ప్రయాణికుల భద్రత, సౌలభ్యం మెరుగుపరచడం తమ ప్రాధాన్యత అని పేర్కొన్నారు.ప్రభుత్వం తనపై ఉంచిన నమ్మకానికి ధన్యవాదాలు తెలుపుతూ, ప్రభుత్వ మార్గదర్శకాలకు అనుగుణంగా పారదర్శకతతో బాధ్యతలు నిర్వర్తిస్తామని సీపీ సుమతి స్పష్టం చేశారు.

# రాష్ట్ర డిజిపిగా ఉద్యోగ బాధ్యతలు స్వీకరించిన సి.వి.ఆనంద్

**హైదరాబాద్,క్రైమ్ బ్యూరో, మే 1 (పీపుల్స్ న్యూస్) :** తెలంగాణ రాష్ట్ర డైరెక్టర్ జనరల్ ఆఫ్ పోలీస్ గా సి.వి ఆనంద్ శుక్రవారం ఉద్యోగ బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా పలువురు ప్రజా ప్రతినిధులు, పోలీసు అధికారులు నూతన డిజిపిని కలిసి శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా తన కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో డిజిపి సివి ఆనంద్ మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర డిజిపిగా తనపై నమ్మకం ఉంచి బాధ్యతలు అప్పగించిన ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి కి, రాష్ట్ర ప్రభుత్వానికి నూతన డైరెక్టర్ జనరల్ ఆఫ్ పోలీస్ సి.వి. ఆనంద్ కృతజ్ఞతలు తెలియజేశారు. ప్రభుత్వ ఆశయాలను నెరవేరుస్తూ, ప్రజలకు భద్రతా భావాన్ని కల్పించేందుకు అహర్నిశలు కృషి చేస్తానని డిజిపి ఈ సందర్భంగా తెలియజేశారు . శాంతిభద్రతల పరిరక్షణ, నేరాల దర్యాప్తు పోలీసుల ప్రాథమిక విధులే అయినా, మారుతున్న కాలానికి అనుగుణంగా సాంకేతికతను జోడించి వ్యవస్థను మరింత బలోపేతం చేస్తామని స్పష్టం చేశారు. తెలంగాణ రాష్ట్ర పోలీస్ శాఖలో విప్లవాత్మక మార్పులకు శ్రీకారం చుడుతున్నట్లు పేర్కొన్న డిజిపి సివి ఆనంద్ ప్రధానంగా నేరం జరిగిన తర్వాత స్పందించడం కంటే, జరగకముందే వచ్చే సంకేతాలను పసిగట్టి అప్రమత్తంగా ఉండటంపై దృష్టి సారిస్తామన్నారు. చిన్న సమస్యలను నిర్లక్ష్యం చేస్తే అవి జటిలమవుతాయని, అందుకే ముందస్తు నిఘా వ్యవస్థను పటిష్టం చేస్తామన్నారు. ముఖ్యంగా మహిళల భద్రత, బాలల అక్రమ రవాణా నియంత్రణ వంటి అంశాలపై రాజీ లేని పోరాటం చేస్తామని ప్రకటించారు.నేటి తరం సైబర్ నేరాలు, డ్రగ్స్ ముప్పును ఎదుర్కొంటోందని ఆందోళన వ్యక్తం చేసిన డిజిపి, వీటిని అరికట్టడానికి సైబర్ సెక్యూరిటీ బ్యూరోను శక్తివంతం చేస్తామన్నారు. విద్యా సంస్థల్లో ‘యాంటీ డ్రగ్స్ కమిటీల’ను ఏర్పాటు చేసి, యువతను ఈ మహమ్మారి నుండి కాపాడతామన్నారు. రోడ్డు ప్రమాదాల నివారణకు గానూ రాష్ట్రవ్యాప్తంగా ఒకే విధమైన నిబంధనలు అమలు చేసేందుకు ప్రత్యేకంగా ‘ట్రాఫిక్ మేనేజ్‌మెంట్ అండ్ రోడ్ సేఫ్టీ బ్యూరో’ను ఏర్పాటు చేయాలని నిర్ణయించారు. కేవలం దొంగతనాలే కాకుండా ఆహార కల్తీ, రియల్ ఎస్టేట్ మోసాలు, బెట్టింగ్, స్మగ్లింగ్ వంటి వ్యవస్థీకృత నేరాలపై ఉక్కుపాదం మోపుతామని హెచ్చరించారు.శాఖ పునర్వ్యవస్థీకరణపై స్పందిస్తూ గతంలో నక్సల్స్ నియంత్రణ కోసం గ్రే హౌండ్స్ , ఎస్ఐబి విభాగాలను ఏర్పాటుచేసి కేటాయించిన సిబ్బందిని ప్రస్తుతం అవసరమైన సైబర్, నార్కోటిక్స్ విభాగాలకు బదిలీ చేస్తామని, అలాగే సుమారు 19 వేల పోలీస్ ఖాళీలను భర్తీ చేసేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉందని, అందులో ఇప్పటికే 5 వేల నియామకాలకు ఆమోదం లభించిందని తెలిపారు. ఏసీబీ, సీఐడీ వంటి కీలక విభాగాలకు పూర్వవైభవం తీసుకురావడంతో పాటు, వివిధ ప్రభుత్వ విభాగాలతో పోలీస్ పరిధిని అనుసంధా



నించి సమన్వయం పెంచుతామన్నారు.సాంకేతికత వినియోగం లో భాగంగా ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ టూల్స్, డ్రోన్ల వినియోగాన్ని పెంచుతామన్నారు. ముఖ్యంగా ట్రాఫిక్ సిగ్నల్స్ సింక్రనైజేషన్ కోసం గూగుల్ వంటి సంస్థల సహకారం తీసుకుంటామని, విపత్తు సమయాల్లో హైడ్రా, ఫైర్ డిపార్ట్‌మెంట్‌తో కలిసి ‘ఫస్ట్ రెస్పాండర్’గా పనిచేసేలా సిబ్బందికి శిక్షణ ఇస్తామన్నారు. రాష్ట్రవ్యాప్తంగా పాడైపోయిన సీసీ కెమెరాల మరమ్మతుల కోసం ప్రత్యేక డ్రైవ్ చేపడతామని, దర్యాప్తులో సాంకేతిక లోపాల వల్ల నేరస్తులు తప్పించుకోకుండా ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ ద్వారా డాక్యుమెంటేషన్‌ను పక్కాగా చేస్తామన్నారు.రాష్ట్రంలో నక్సలిజం దాదాపు తుడిచిపెట్టుకుపోయిందని, మిగిలి ఉన్న వారు కూడా పునరావాస పాలసీ ప్రకారం జనజీవన స్రవంతిలో కలవాలని కోరారు. ఫోన్ ట్యాపింగ్ కేసు దర్యాప్తు తుది దశలో ఉందని, త్వరలోనే సమీక్షించి దానికి అనుగుణంగా చార్జ్ షీట్ వేస్తామని తెలిపారు. సోషల్ మీడియాలో వ్యక్తిగత దూషణలకు దిగితే కఠిన చర్యలు ఉంటాయని హెచ్చరిస్తూనే, రాజ్యాంగబద్ధమైన భావప్రకటనా స్వేచ్ఛను గౌరవిస్తామన్నారు. చివరగా, తాను ‘మైక్రో మేనేజ్‌మెంట్’ విధానాన్ని అనుసరిస్తానని, క్షేత్రస్థాయి అధికారులకు పూర్తి స్వేచ్ఛనిస్తూనే క్రైమ్ మీటింగ్స్ ద్వారా వారి పనితీరును పర్యవేక్షిస్తానని డిజిపి సి.వి. ఆనంద్ స్పష్టం చేశారు. విలేకరుల సమావేశంలో శాంతి భద్రతల డిజి మహేష్ ఎం భగవత్, టిఎస్ఎల్పిఆర్బి చైర్మన్ వివి శ్రీనివాసరావు, ఎస్పిఎఫ్ డిజి స్వాతి లక్రా, హైదరాబాద్ పోలీస్ కమిషనర్ వి సి సజ్జనార్, డిజి, సిఐడి చారు సిన్హా, గ్రేహౌండ్స్ , ఆక్టోపస్ డిజి అనిల్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

